క్లుప్తంగా

ఉపాధి కూలీల సంబురాలు



ఉపాధి కూలీలతో ఎంపీపీ విమల

మల్యాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో పని ప్రదేశంలో సంబురాలు నిర్వహించారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మహిళలు బతుకమ్మ ఆటలు ఆడి, డ్యాన్సులు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గుండేటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయించాలి



ప్రణాళికలు పరిశీలిస్తున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: రైతులకు సాగునీరు అందే విధంగా కాలువల్లో ఉపాధి కూలీలతో పూడిక తీయించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఉపాధి సిబ్బందిని కోరారు. వేములకుర్తిలో ఎంపీవో కృపాకర్‌పై గురువారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేయగా, తన కార్యాలయంలో శుక్రవారం టెక్నికల్ అసిస్టెంట్ ప్రవంతిని పిలిచి ఎంపీపీ ఆరా తీశారు. కాలువల్లో పూడిక తీయించాలని పలుసార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఉపాధి సిబ్బందికి ఆదేశించినా ఎందుకు జాప్యం చేస్తున్నారని అడిగారు. కాలువల్లో పూడిక తీయించేందుకు ప్రణాళికలు తయారు చేశామని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఎంపీపీకి వివరించారు. వర్షాలు పడకముందే కాలు వల్లో పూడికలు తీయించాలని ఎంపీపీ ఆదేశించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి



సీఐ కోటేశ్వర్

మల్యాల: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, అసాంఘిక కార్యకలాపాలు సాగించేవారిని ఉపేక్షించమని మల్యాల సీఐ బి.కోటేశ్వర్ అన్నారు. మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.కోటేశ్వర్ శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ రమణమూర్తి ధర్మపురికి బదిలీకాగా, ధర్మపురిలో సీఐగా విధులు నిర్వహించిన కోటేశ్వర్ మల్యాలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల సహకారంతో సర్కిల్ పరిధిలో నేరాలను నియంత్రించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

డ్రైయినేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మల్యాల: మండలంలోని ముత్యంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద డ్రైయినేజీ నిర్మాణానికి జెడ్పీటీసీ రాంమోహన్‌రావు, సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఆలయం వద్ద మురికి నీరు నిలిచి చాలా ఏళ్లుగా భక్తులు ఇబ్బంది పడుతుండడంతో జెడ్పీటీసీ రాంమోహన్‌రావు చొరవతో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.1.50 లక్షల నిధులు మంజూరు కాగా, భూమిపూజ చేశారు. ఎల్లమ్మ ఆలయం నుంచి భీమన్న చెరువు వరకు మురికి కాలువ నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ఎంపీటీసీ సామల రేణుక, ఉప సర్పంచ్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్‌షాపుల్లో తనిఖీ

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో మండల వ్యవసాయ అధికారి త్రివేదిక శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాలు, క్రిమిసంహారక మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు రశీదులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

ఆలస్యం అవుతున్న అత్యవసర పనులు

- ఈ-పంచాయతీ సేవలు ఇంకెప్పుడో?
- పంచాయతీల్లో నిరుపయోగంగా కంప్యూటర్లు
- పల్లె ప్రజలకు అందని సేవలు
- ఇబ్బందుల్లో గ్రామీణ ప్రజలు



సాతారం గ్రామపంచాయతీలో నిరుపయోగంగా కంప్యూటర్లు

మల్లాపూర్: ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకి పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి పల్లె ప్రజలకు వివిధ సేవలు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. గ్రామ పంచాయతీల నుంచి ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ-పంచాయతీ సేవలు అధికారుల నిర్లక్ష్యంతో అందడం లేదు. కానీ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారుల అలసత్వంతో కంప్యూటర్లు తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్, ఇంటర్‌నెట్ సౌకర్యం లేక పంచాయతీల్లో ఈ-సేవల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి.

అందని సేవలు..

మండలంలో 23 గ్రామ పంచాయతీలకు గాను 10 క్లస్టర్ గ్రామాల్లో ఈ-పంచాయతీ సేవలను అందించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. మల్లాపూర్‌తో పాటు మొగిలిపేట, ముత్యంపేట, సాతారం, చిట్టాపూర్, సిరిపూర్, కుస్తాపూర్, రేగుంట, వెంకట్రావ్‌పేట, పాతదాంరాజుపల్లి గ్రామ పంచాయతీల్లో ఈ-పంచాయతీ సేవలను ప్రారంభించిన వివిధ కారణాలతో సేవలు నిలిచిపోయి కంప్యూటర్లు తుప్పుపట్టిపోతున్నాయి. ప్రజలకు రెవెన్యూ సిబ్బందితో సంబంధం లేకుండా విన్నూత ప్రయోగంగా నీటి పన్ను, ఇంటి పన్ను, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందించాల్సిన ఈ-పంచాయతీ సేవలు గ్రామీణ ప్రజలకు అందకుండా పోతున్నాయి. గ్రామ పంచాయతీల్లో ఈ-పంచాయతీలు ఏర్పాటు చేసినా... కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు ఇంటర్‌నెట్ సౌకర్యం లేక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తిరిగి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఈ-పంచాయతీ సేవలు ఉపయోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆపరేటర్లు లేక ఆగిన సేవలు..

మల్లాపూర్ మండల కేంద్రంతో సహా 10 క్లస్టర్ గ్రామ పంచాయతీల్లో ఈ-పంచాయతీ సేవలు ప్రారంభించినా.. కేవలం ఒక మల్లాపూర్‌కు మాత్రమే ఆపరేటర్‌ను నియమించారు. ఆయా గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్నా ఆపరేటర్లు లేకపోవడంతో కంప్యూటర్లు మూలనపడ్డాయి. దీంతో సాంకేతిక సేవలు అందక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఈ-పంచాయతీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి



మల్లాపూర్ మండలంలో 23 పంచాయతీలకు గాను 10 క్లస్టర్ గ్రామ పంచాయతీల్లో ఈ-పంచాయతీ సేవలను ప్రారంభించాం. ఆపరేటర్ల కొరతతో సేవలు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ-పంచాయతీ సేవలకు త్వరలోనే ఆయా గ్రామాల ప్రజలకు సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం.

– రాజశ్రీనివాస్, ఎంపీడీవో, మల్లాపూర్



ప్రమాదకరంగా గుంత.. పట్టించుకునే వారేరి?

పెగడపల్లి: మండల కేంద్రంలోని నంది చౌరస్తా వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా తయారైంది. గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకైన నీటితో లోతైన గుంత ఏర్పడింది. అసలే మూల మలుపు వద్ద లోతైన గుంత ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు జంకుతున్నారు. లీకేజీ నీటిని అరికట్టి గుంత పూడ్చివేతకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంత పూడ్చివేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ రుణాల దరఖాస్తు గడువు పొడిగించాలి

సారంగాపూర్: బీసీ రుణాల ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడిగించాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. ప్రభుత్వం రూ.1 లక్ష సాయం అందించడానికి బీసీ ల్లోని కొన్ని కులాలకు ఈ అవకాశాన్ని కల్పించిన విషయం తెలిసిందే. రూ. 1 లక్ష సాయం పొందడానికి మీ సేవా ద్వారా కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 6న రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రెండు మూడు రోజులు దరఖాస్తుదారులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు నిర్ణీత సమయంలో అధికారులు అందించారు. రాను రాను మీసేవా కేంద్రాల వద్ద రద్దీ విపరీతంగా పెరిగి పోవడం, దరఖాస్తుదారులు వందలాది మంది ధ్రువీకరణ పత్రాల కోసం అప్‌లై చేసుకోవడంతో మీసేవా సర్వర్‌లు పనిచేయడం లేదు. ఈ కారణంగా మండల తహసీల్దార్ కార్యాలయంలో దాదాపు 300 మంది వరకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ కోసం నిరీక్షిస్తున్నారు. దీంతో తమకు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు పొందడానికి తీవ్ర జాప్యం జరుగుతుందని, రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి మరో 10 రోజులు పొడగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రవీందర్ రావును వివరణ కోరగా మీసేవా సర్వర్ బీజీగా ఉందని, సాధ్యమైనంత వరకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను వెంటవెంట జారీ చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రాయికల్: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీల్లో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో గుడికోట ఆలయంలో రూ.కోటి వ్యయంతో హిందూ కమ్యూనిటీ ఓపెన్ షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్సీ రమణతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ భవనంలో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలో రూ.25 కోట్లతో ప్రతి వార్డుల్లో సీసీరోడ్లు, మురికికాలువల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, పల్లెప్రకృతి వనం, ప్రజా మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణాలు, బస్తీ దవాఖానా, వైకుంఠ దామం, తాగునీటి ఎద్దడి నివారణకు తగు చర్యలు చేపట్టామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని డీ-52 తూము నుంచి రాయికల్ పెద్ద చెరువును సస్యశ్యామలం చేసి బోర్నపల్లి వరకు సాగునీరు అందిస్తున్నామని గుర్తుచేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రాయికల్ అభివృద్ధిని కూడా పట్టించుకోలేని ప్రతిపక్ష నాయకులు బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని, నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితుల్లో సామాన్యులున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్ సంతోష్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

చెన్నకేశవనాథ ఆలయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు

పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, అర్చకులు సతీశ్‌శర్మ, రమేశ్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

గ్రామీణులు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం పెగ్గెర్ల, ఊటపెల్లి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మాట్లాడారు. ఆహారపు అలవాట్లలో మార్పులు జరగడంతో తక్కువ వయస్సుగల వారు బీపీ, షుగర్ బారిన పడటం బాధాకరమన్నారు. ప్రజలు ఏడాదికోసారి పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే ఎక్కువ కాలం జీవించవచ్చన్నారు. వైద్యం ఖరీదు కావడంతో పేద ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాలంటే భయపడుతున్న సందర్భాలున్నాయన్నారు. ప్రజలకు సేవా చేయాలనే సంకల్పంతోనే తమ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు గ్రామాల్లో 1,300 మందికి చికిత్సలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు జవిడి ప్రతాప్‌రెడ్డి, గజ్జెల స్వామి, గంగప్రసాద్, ఎంపీటీసీ బాదినేని రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు ఏజీబీ మహేందర్, మామిడిపెల్లి రవి, గాండ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘బీఎస్పీ కార్యకర్తలకు ఎమ్మెల్యే బెదిరింపు’



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మల్యాల: చొప్పదండి నియోజకవర్గంలో బీఎస్పీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక, కార్యకర్తలు, నాయకులకు ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామంటూ చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బెదిరింపులకు పాల్పడుతున్నారని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్ ఆరోపించారు. శుక్రవారం మల్యాలలో మాట్లాడారు. బీఎస్పీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి, ఎమ్మెల్యే రవిశంకర్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. బీఎస్పీలో చేరిన కార్యకర్తలకు దళిత బంధు ఇవ్వమని బెదిరిస్తూ, బీఎస్పీ కార్యకర్తలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి, నియోజకవర్గ అభివద్ధిని పట్టించుకోకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని, కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు మునుగూరి నివాస్, మ్యాక రూపేశ్, సుమంత్, మల్యాల విష్ణు, గుడిసె గౌతమ్, గుడిసే రాజేందర్, ఉప్పరి సంజయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపల్ శ్రీధర్ తెలిపారు. పీజీటీ తెలుగు 2, పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ ఎకనామిక్స్, టీజీటీ హిందీ 2, టీజీటీ తెలుగు, టీజీటీ సైన్స్, టీజీటీ సోషల్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. టీజీటీకి సంబంధిత సబ్జెక్ట్‌లో బీఈడీ, టెట్, పీజీటీకి సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ ఉండాలని, ఇంగ్లిష్ మీడియంలో బోధించే అర్హత గల అభ్యర్థులు ఈనెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎస్ఎస్వీ కళాశాలలో జాబ్‌మేళా



జగిత్యాల: ఎస్ఎస్వీ కళాశాలలో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ ఉద్యోగాలు అందించాలనే లక్ష్యంతో ఐసీఐసీఐ బ్యాంక్ జాబ్‌మేళా నిర్వహిస్తోందని, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు పాతబస్టాండ్‌లోని ఎస్ఎస్వీ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మిగతా వివరాలకు 94911 65294 సంప్రదించాలని కోరారు.

‘ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యలపై విచారణ జరపాలి’

మెట్‌పల్లి: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క శుక్రవారం డిమాండ్ చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల బలవన్మరణాలకు పాల్పడుతుండడం బాధాకరమన్నారు. వీటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారించడం తగదన్నారు. వసతుల కోసం విద్యార్థులు ఆందోళనలు చేస్తే .. మంత్రులు క్యాంపస్‌ను సందర్శించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆత్మహత్య సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు తగిన విధంగా వసతులు కల్పించాలన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

మెట్‌పల్లి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీ పీసీసీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. బీఈడీ, డీఈడీ, టీటీసీ కోర్సులను పూర్తి చేసిన వేలాది మంది అభ్యర్థులు ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల కోసం నిరీక్షిస్తున్నారన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం.. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఖాళీలతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వెంటనే పోస్టులను భర్తీ చేయాలన్నారు.

బీసీలందరికీ రూ. లక్ష ఆర్థికసాయం అందించాలి

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కులవృత్తులకు రూ. 1 లక్ష ఆర్థిక సహాయాన్ని బీసీల్లోని అన్ని వర్గాలకు వర్తింప చేయాలని బీసీ యువజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శికారి గోపి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సబ్బండ వర్గాల త్యాగాల ఫలితంగానే తెలంగాణ వచ్చిందన్నారు.

జువ్వాడి కుటుంబానికి శ్రీధర్‌బాబు పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు

ధర్మపురి: దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు సతీమణి జువ్వాడి సుమతి దేవి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం తిమ్మాపూర్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రావు కుమారులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, చంద్రశేఖర్‌రావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

బదిలీపై వెళ్తున్న సీఐ,ఎస్సైలకు సన్మానం



సీఐ,ఎస్సైలను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

ధర్మపురి: ధర్మపురి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్‌లకు ధర్మపురి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కన్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో శుక్రవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సీఐ కోటేశ్వర్ మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలో పోలీసులు, పాత్రికేయులు ఐకమత్యంతో పాటు సోదర భావంతో ఉన్నారని వారు చూపిన ఆదరాభిమానాలు మరువలేనివని, అందరం ఫ్రెండ్లీ భావంతో మెలిగామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారంగాపూర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్ మాదిగ అన్నారు. శుక్రవారం మండలంలోని రేచపల్లిలో మాట్లాడారు. 50 రోజుల మిషన్‌లో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటానికి అందరూ సహకరించి, హైదరాబాద్ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇచ్‌చార్జి మీసాల చంద్రయ్య, ఎదురుగట్ల శంకర్, చిట్యాల సురేశ్, చిట్యాల రమేశ్ పాల్గొన్నారు.

ఎండతీవ్రతకు కాలిపోయిన జనరేటర్

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో ఎండ తీవ్రతకు శుక్రవారం బీఎస్ఎన్ఎల్ టవర్ వద్దనున్న జనరేటర్ కాలిపోగా విషయం తెలుసుకున్న సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ మంటలు ఆర్పివేయించి బీఎస్ఎన్ఎల్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఉత్తమ ఫార్మాసిస్ట్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ ఫార్మాసిస్ట్ అవార్డును అందుకున్న ఉదయ్‌ప్రసాద్‌ను శుక్రవారం వైద్యాధికారి శ్రీజతో పాటు సిబ్బంది మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సన్మానించారు. వైద్యాధికారి శ్రీజ మాట్లాడుతూ ఉదయ్‌ప్రసాద్‌కు అవార్డు రావడం సంతోషకరంగా ఉందని భవిష్యత్తులో వైద్య సిబ్బంది మంచి సేవలు అందించి అవార్డులు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయభాస్కర్, స్టాఫ్ నర్సు రాజేందర్, హెచ్ఈవో కృపాకర్, సూపర్‌వైజర్ ఉష, ల్యాబ్ టెక్నిషియన్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిమెట్టు పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఈనెల 20న నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా రూపొందించిన తొలిమెట్టు పోస్టర్‌ను ఎంఈవో గంగాధర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా దినోత్సవం రోజున ప్రభుత్వ పాఠశాలలో సుందరంగా అలంకరించడం, ర్యాలీలు నిర్వహించడం, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్,అభయ్‌రాజ్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు రవీందర్, సత్యనారాయణ, శ్రీనివాస్, పీసీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన గల్ఫ్ అబుదాబి సహాయ బృందం చిన్నారి చికిత్స కోసం రూ. 10 వేలు పంపించారు. వివరాలి ఈ విధంగా ఉన్నాయి. బుగ్గారం మండలం సిరికొండ గ్రామానికి చెందిన సులిగే సుజాత-అనిల్ దంపతులకు పది రోజుల క్రితం ఓ కుమారుడు జన్మించాడు. మెదడులో న్యూరో సమస్యలు ఏర్పడి అనారోగ్యానికి గురయ్యాడు. దీనితో చిన్నారి చికిత్స కోసం రూ. 10 వేలు అబుదాబి నుంచి బృందం సభ్యులు పంపించారు. ఈ సందర్భంగా కొల్వాయి గ్రామస్తులు, సుజాత-అనిల్ దంపతులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.